# జూలై 5లోగా రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోండి

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద వానాకాలం సీజన్‌కు సంబంధించిన ఆర్థిక సహాయాన్ని జూలై 30న విడుదల చేయనున్న నేపథ్యంలో, అర్హులైన కొత్త పట్టాదారులందరూ జూలై 5వ తేదీలోగా తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా కోరారు. శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2026 జూన్ 15 నాటికి కొత్తగా వ్యవసాయ భూములు కొనుగోలు చేసి పట్టాదారు పాస్‌పుస్తకం పొందిన రైతులు రైతు భరోసా పథకానికి అర్హులని తెలిపారు. అర్హులైన రైతులు తమ గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారి, సంబంధిత మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో దరఖాస్తు సమర్పించాలని సూచించారు. దరఖాస్తుతో పాటు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు, ఆధార్‌తో అనుసంధానమైన బ్యాంకు పాస్‌బుక్, మొబైల్ నంబర్ సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పట్టాదారు పాస్‌పుస్తకం అందుబాటులో లేని వారు ఆన్‌లైన్ 1–బి ప్రతిని జతచేయవచ్చని అన్నారు. అర్హత కలిగిన ప్రతి కొత్త పట్టాదారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గడువులోగా దరఖాస్తు చేసుకుంటే, వానాకాలం రైతు భరోసా పథకం కింద ఎకరానికి రూ.6వేల చొప్పున ఆర్థిక సాయం పొందే అవకాశం ఉంటుందని వివరించారు.

# పోలియో రహిత సమాజం కోసం అందరు సహకరించాలి



**ఉద్యమ కెరటం, తాండూర్:** పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ సహకరించాలని తాండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ ఝాన్సీ కోరారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా తాండూర్ మండలంలోని సున్నా నుంచి ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు ఆదివారం పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. మండల ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా మొత్తం 21 పోలియో బూత్‌లను ఏర్పాటు చేసి, 84 మంది సిబ్బందిని విధుల్లో నియమించినట్లు పేర్కొన్నారు. ఆదివారం బూత్ కేంద్రాల్లో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. మండలంలోని తల్లిదండ్రులు తమ ఐదేళ్లలోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# రాజీవ్‌నగర్‌లో ప్రత్యేక ఓటరు జాబితా సర్వే



**ఉద్యమ కెరటం, తాండూర్:** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా తాండూర్ మండలంలోని రాజీవ్‌నగర్ గ్రామంలో శనివారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎల్ఓ రజిత, బీఎల్ఏ సీహెచ్.నరేష్, సర్పంచ్ మామిడాల లలిత రాజేశం, ఉప సర్పంచ్ కాపర్తి సుభాష్, పంచాయతీ కార్యదర్శి రమాదేవి, వార్డు సభ్యులు గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను పరిశీలించారు. అలాగే ఓటరు జాబితాలో అవసరమైన మార్పులు, చేర్పులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కొంక అశోక్, రౌతు సురేష్ గ్రామస్థులు పాల్గొన్నారు.

# దామెరలో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం



**ఉద్యమ కెరటం, హన్మకొండ:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో దామెర మండల కేంద్రంలో మండల నాయకులు సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, జిల్లా కార్యదర్శి సదిరం పోషయ్య, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు మన్నెం ప్రకాశ్ రెడ్డి, నాయకులు కునుమల్ల రవీందర్, బిల్లా రమణ రెడ్డి, పోలుసాని అనిల్ రెడ్డి, దురిశెట్టి బిక్షపతి, సదిరం లింగయ్య, బింగి రాజేందర్, వార్డు సభ్యులు దామెర అఖిల, ఇమ్మడి భారతి రజనీకర్, సదిరం వంశీ, గ్రామస్థులు పాల్గొన్నారు.

# చినుకు పడితే 'చీకటే'...!

## రెండేళ్లు గా లో వోల్టే జ్‌తో బాలాజీ నగర్ వాసుల అవస్థలు..!

- అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటులో నిర్లక్ష్యం..!
- స్పందించని అధికారులు..

**ఉద్యమ కెరటం జైనూర్ ( సాబీర్ పాషా**

ఆకాశంలో మబ్బులు కమ్మి, చిన్న చినుకు పడితే చాలు.. జైనూర్ మండల కేంద్రంలోని బాలాజీ నగర్ వాసులు గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఎప్పుడు కరెంట్ పోతుందో, మళ్లీ ఎప్పుడు వస్తుందో తెలియని దుస్థితి. ఒకవైపు తరచూ విద్యుత్ అంతరాయాలు, మరోవైపు గత రెండేళ్లుగా వేధిస్తున్న లో వోల్టేజ్ సమస్యతో ఇక్కడి ప్రజల సహనం నశిస్తోంది. వర్షాకాలం ప్రారంభమైన వేళ.. తమ విద్యుత్ కష్టాలు తీరేదెన్నడూ అని బాలాజీ నగర్ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పరికరాలు కాలిపోతున్నాయి..నిలదీస్తు న్న ప్రజలు**



బాలాజీ నగర్‌లో లో వోల్టేజ్ సమస్య ఎంత తీవ్రంగా ఉందంటే.. ఇళ్లల్లో కనీసం ఫ్యాన్లు తిరగవు, బల్బులు వెలగవు. తక్కువ వోల్టేజ్ కారణంగా ఇళ్లలోని ఖరీదైన టీవీలు, ఫ్రిజ్‌లు, మిక్సీలు, మోటార్లు, ఇతర విద్యుత్ పరికరాలు దెబ్బ తింటున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేల రూపాయలు పెట్టి కొనుక్కున్న వస్తువులు కాలిపోతుంటే.. తాము ఆర్థికంగా నష్టపోతున్నామని ఇక్కడి నివాసితులు వాపోతున్నారు.

**స్త ంభాలు మార్చారు.. కానీ సమస్య మారలేదు..!**

ఈ సమస్యపై స్థానికులు పలుమార్లు విద్యుత్ శాఖ అధికారుల చుట్టూ తిరిగారు. కాగా, నెల రోజుల క్రితం అధికారులు స్పందించి పాత విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త స్తంభాలను మార్చారు. అయితే, స్తంభాలు మార్చినా వోల్టేజ్ సమస్యలో ఎలాంటి మార్పు రాలేదని, పరిస్థితి 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్న చందంగా ఉందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**కాంట్రాక్టర్ నిర్లక్ష్యం...పెడచెవిన పెట్టిన అధికారులు..!**

బాలాజీ నగర్‌లోని లో వోల్టేజ్ సమస్యకు అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడమే ఏకైక శాశ్వత పరిష్కారమని స్వయంగా విద్యుత్ శాఖ సిబ్బందే చెబుతున్నారు. అయితే, ఈ పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. పనులు చేపట్టకుండా కాలయాపన చేయడమే కాకుండా, స్థానికులు ఫోన్ చేసి అడిగితే కనీసం స్పందించడం లేదని ప్రజలు మండిపడుతున్నారు.

**ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలి**

ప్రస్తుతం వర్షాకాలం ముంచుకొచ్చింది. ఈ సమయంలో గంటల తరబడి కరెంట్ లేకపోతే పాములు, తేళ్లు వంటి విషకీట కాలతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. జైనూర్ విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు తక్షణమే జోక్యం చేసుకోవాలని బాలాజీ నగర్ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు. నిర్లక్ష్యం వహిస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని, యుద్ధప్రాతిపదికన అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని, సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

# ఓటరు జాబితా సవరణకు ప్రజలు సహకరించాలి

- మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండి అహ్మద్

**ఉద్యమ కెరటం,ఆసిఫాబాద్ :**

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా పట్టణంలో ఇంటింటా నిర్వహిస్తున్న ఎన్యుమరేషన్ ప్రక్రియ సజావుగా సాగేందుకు ప్రజలందరూ పూర్తిస్థాయిలో సహకరించాలని ఆసిఫాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండి అహ్మద్ కోరారు. శనివారం ఆయన స్థానిక అధికారులు, బూత్ స్థాయి అధికారులతో కలిసి పట్టణంలోని 17వ వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలుసుకుని, వారికి సంబంధించిన దరఖాస్తు ఫారాలను అందజేశారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ ఎండి అహ్మద్ మాట్లాడుతూ ఓటు హక్కు అనేది ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైనదని, అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరు జాబితాలో తమ పేరును నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ ఓటరు జాబితా సవరణ ప్రక్రియను వంద శాతం విజయవంతం చేసేందుకు ముఖ్యంగా యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. స్థానిక అధికారులకు, బీఎల్‌వోలకు ప్రతి ఒక్కరూ సహకరించి తమ వివరాలను నమోదు లేదా సవరణ చేసుకోవాలని కోరారు. ఈ



కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, బీఎల్‌వోలు, వార్డు ప్రముఖులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆడపిల్లల పెళ్లికు ప్రభుత్వం అండగా నిలుస్తోంది

- కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే హరీష్ బాబు

**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** ఆడపిల్లల పెళ్లిలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్బాబు అన్నారు. చింతలమానేపల్లి రైతు వేదికలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో చింతలమానేపల్లి మండలానికి చెందిన 40 మంది, బెజ్జూర్ మండలానికి చెందిన 52 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం



ఆడపిల్లల వివాహాల కోసం కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా ఆర్థిక సహాయం అందిస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతిఒక్కరూ ఈ సంక్షేమ పథకాలను వినియోగించుకుని ప్రభుత్వ సేవలను పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ప్రకాష్, రామ్మోహన్ రావు, డీటీలు దౌలత్, భీమ్లా నాయక్, ఎంపీడీఓ సత్యనారాయణ, ఎంపీఓ శ్రీనివాస్, ఆర్ఐలు జాఫర్, మాజీ జెడ్పీటీసీ ఎల్ములే మల్లయ్య, సర్పంచులు బాలు నాయక్, శ్యామ్ రావు, అశోక్, తేలి బాపు, కుమ్మరి రామకృష్ణ, సోయం చిన్నయ్య, నందిపేట రాజయ్య, ఉప సర్పంచ్ జైరామ్, బిక్షపతి, నాయకులు జాడి దిగంబర్, జాడి తిరుపతి, వసి ఖాన్, కొప్పుల దిలీప్, మనోహర్ గౌడ్, సంతోష్, రాజారాం, తుకారాం, పురుషోత్తం, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి పేదవాడికి సొంత ఇల్లే లక్ష్యం

- ఇందిరమ్మ ఇళ్లతో పేదలకు శాశ్వత నివాసం
- ఆదిలాబాద్‌లో మంత్రులు జూపల్లి, అజారుద్దీన్

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదల జీవితాల్లో వెలుగులు నింపుతోందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్ అన్నారు. శనివారం ఆదిలాబాద్ పట్టణం అంబేద్కర్ కాలనీ వార్డు నం. 31లో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ గృహాలను మంత్రులు జూపల్లి కృష్ణారావు, అజారుద్దీన్‌తో పాటు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు శాశ్వత నివాస సౌకర్యం కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి గౌరవప్రదమైన సొంత ఇంటిని అందించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదల ముఖాల్లో ఆనందం చూడటమే తమ ధ్యేయమని అన్నారు. పథకంలో భాగంగా నూతన గృహం పొందిన లబ్ధిదారు అస్మా బేగం ఇంటిని మంత్రులు సందర్శించి పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులను అభినందించి వారికి వస్త్రాలను అందజేసి సన్మానించారు. ఈ



కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ ఆర్‌వీస్. చిత్రు, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష, ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# రిజిస్ట్రేషన్ ఆఫీస్ వద్దు.. గర్ల్స్ డిగ్రీ కాలేజీ ముద్దు..

**మంత్రికి బీఆర్ఎస్ నాయకుల వినతి**

**ఉద్యమ కెరటం, అదిలాబాద్ టౌన్ :** ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు వచ్చిన తెలంగాణ రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజహరుద్దీన్, టేమ్రిస్ చైర్మన్ ఫహీమ్ ఖురేషీ ను బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సయ్యద్ సాజీద్, యూనుస్ అక్బాని మర్యాదపూర్వకంగా కలిశారు. కొద్దిరోజుల క్రితం రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని తరలించాలని ప్రతిపాదించిన ప్రీమెట్రిక్ హాస్టల్ భవనాన్ని, బాలికల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కేటాయించాలని కోరుతూ వారు వినతిపత్రాన్ని అందజేశారు. సదరు హాస్టల్ భవనంలో రిజిస్ట్రేషన్ ఆఫీస్‌ను ఏర్పాటు చేయడం కంటే, స్థానిక బాలికల



ఉన్నత విద్యా అవసరాలను తీర్చేందుకు గర్ల్స్ డిగ్రీ కాలేజీని ప్రారంభించడం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని మంత్రి, చైర్మన్ ల దృష్టికి బీఆర్ఎస్ నాయకులు తీసుకెళ్లారు. ఈ విషయమై స్పందించిన మైనార్టీ శాఖ మంత్రి తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలల సొసైటీ చైర్మన్ లు, స్థానిక విద్యాభివృద్ధికి బాలికల ఉన్నత చదువులకు తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఆదిలాబాద్ జిల్లాలోని మైనారిటీ విద్యార్థినుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, బాలికల విద్యా అవకాశాలను మెరుగుపరిచేందుకు ఈ ప్రతిపాదనను సానుకూలంగా పరిశీలించి, తగిన చర్యలు తీసుకుంటామని వారు స్పష్టం చేశారు. భవనాన్ని విద్యాసంస్థకే కేటాయించేలా చొరవ చూపాలని సయ్యద్ సాజీద్, యూనుస్ అక్బాని ఈ సందర్భంగా కోరారు.

# ఓటరు జాబితా సవరణలో అక్రమాలు...!

## ఈసీకి ఎంబీటీ ఫిర్యాదు



**ఉద్యమ కెరటం, హైదరాబాద్:** హైదరాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గంలో ప్రస్తుతం జరుగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక నిఘా సవరణ (SIR) ప్రక్రియ సాగుతున్న తీరుపై మజ్లిస్ బచావో తెహ్రీక్ (MBT) ప్రతినిధి అమ్జద్ ఉల్లా ఖాన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియలో ఎన్నికల సంఘం నిబంధనలను బేఖాతరు చేస్తూ పలు అక్రమాలు జరుగుతున్నాయంటూ ఆయన భారత ముఖ్య ఎన్నికల కమిషనర్‌కు శనివారం ఫిర్యాదు చేశారు. సవరణ ప్రక్రియలో భాగంగా రెండో రోజు మొహర్రం పర్వదినం కారణంగా మెజారిటీ బూత్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయి విధులకు హాజరు కాకపోవడంతో పనులకు తీవ్ర ఆటంకం కలిగిందని ఆయన తెలిపారు. ఇక మూడో రోజు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుండి నిబంధనల ఉల్లంఘనలపై ఎంబీటీకి అనేక ఫిర్యాదులు అందాయని పేర్కొన్నారు.

### ఇంటింటికీ వెళ్లకుండా.. పార్టీ కార్యకర్త ఇంట్లోనే విధులు

మలక్‌పేట్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ స్టేషన్ నంబర్లు 34, 35, 36, 37, 44కు చెందిన బీఎల్‌ఓలు నిబంధనల ప్రకారం ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించాల్సి ఉండగా.. అందుకు విరుద్ధంగా ఏఐఎంఐఎం రాజకీయ పార్టీ కార్యకర్త ఇంట్లో కూర్చుని, ఓటర్లను అక్కడికే రావాలని కోరుతున్నట్లు తమకు ఫిర్యాదులు వచ్చాయని అమ్జద్ ఉల్లా ఖాన్ తెలిపారు. ఈ అక్రమాలను ప్రశ్నించినందుకు మహ్మద్ సాదుల్లా ఖాన్ అనే సామాజిక కార్యకర్తపై సదరు పార్టీ కార్యకర్తలు భౌతిక దాడికి దిగారని, దీనిపై చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. మరో ఘటనలో, సర్వేఖాస్ పల్టన్ ప్రాంతంలో ఒక బీఎల్‌ఓ తనకు కేటాయించిన ఎన్యుమరేషన్ ఫారాలను పొలిటికల్ పార్టీకి చెందిన బూత్ లెవెల్ ఏజెంట్ (BLA) చేతికి ఇచ్చి క్షేత్రస్థాయిలో అందుబాటులో లేకుండా పోయారని ఎంబీటీ ఆరోపించింది. ప్రజలు ఆ బీఎల్‌ఓను సంప్రదించినప్పుడు.. సదరు పార్టీ ఏజెంట్ వద్ద నుండి ఫారాలు తీసుకోవాలని సమాధానం ఇస్తున్నట్లు స్థానికులు ఫిర్యాదు చేశారన్నారు.

### బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

ఎన్నికల విధులను రాజకీయ పార్టీల కార్యకర్తలకు ఎలా అప్పగిస్తారని అమ్జద్ ఉల్లా ఖాన్ ప్రశ్నించారు. బీఎల్‌ఓలు ప్రతి ఇంటిని స్వయంగా సందర్శించి, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఓటర్ల వెరిఫికేషన్ పూర్తి చేసేలా తెలంగాణ సీఈఓ, హైదరాబాద్ డీఈఓ, జీహెచ్‌ఎంసీ కమిషనర్‌లకు తగిన ఆదేశాలు జారీ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అధికారిక ఫారాలను రాజకీయ పార్టీల కార్యకర్తలకు ఇచ్చే, వారి కార్యాలయాలు లేదా నివాసాల నుండి విధులు నిర్వహించే బీఎల్‌ఓలపై కఠినమైన క్రమశిక్షణా, క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు తక్షణమే దిద్దుబాటు చర్యలు చేపట్టి ఎన్నికల ప్రక్రియ యొక్క పవిత్రతను కాపాడాలని అమ్జద్ ఉల్లా ఖాన్ కోరారు.

# మైనార్టీ విద్యార్థులకు నాణ్యమైన విద్యే ప్రభుత్వ లక్ష్యం

- **జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు**
- **రూ.20 కోట్లతో నిర్మించిన మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాల భవనం ప్రారంభం**

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** మైనార్టీ విద్యార్థులకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్యతో పాటు ఆధునిక వసతులు కల్పించి వారిని అన్నిరంగాల్లో పోటీతత్వానికి సిద్ధం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం ఆదిలాబాద్ పట్టణం బంగారుగూడలో రూ.20 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల–కళాశాల (బాలుర) భవనాన్ని రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీతో కలిసి మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రులు నూతన భవనంలోని తరగతి గదులు, వసతి గదులు, భోజనశాలతో పాటు ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అత్యాధునిక వసతులు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. మైనార్టీ విద్యార్థులు విద్యనే ఆయుధంగా మలుచుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. విద్యా రంగంలో సమాన అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, రాష్ట్రంలోని మైనార్టీ విద్యా సంస్థలను మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యతనిస్తూ మైనార్టీ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సురక్షిత వసతి, ఆధునిక మౌలిక సదుపాయాలు, మెరుగైన బోధన వాతావరణాన్ని అందిస్తోందని తెలిపారు. ఇలాంటి విద్యాసంస్థల ద్వారా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ఉన్నత విద్యలో రాణించే అవకాశాలు మరింత మెరుగుపడతాయని అన్నారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో మంత్రులు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీ జి.నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష, జిల్లా కలెక్టర్ రాజర్షిషా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ ఆర్‌ఎస్. చిత్రు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.








# లబ్ధిదారులకు నేరుగా ప్రభుత్వ సహాయం

- **ప్రజాస్వామ్యంలో ఓటు హక్కును రక్షించాలి**
- **రాష్ట్ర మంత్రులు జూపల్లి, అజారుద్దీన్**





**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** లబ్ధిదారులకు నేరుగా ప్రభుత్వ సహాయం అందుతుందని, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కును రక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, అజారుద్దీన్, ప్రభుత్వ ప్రధాన సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎంఏ. ఫహీమ్ అన్నారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో పర్యటించారు. ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, స్థానిక నాయకులు మంత్రులకు ఘన స్వాగతం పలికారు. మంత్రులు మహాలక్ష్మి వాడ, తాటిగూడ, బంగార్గూడ, అంబేద్కర్ నగర్ ప్రాంతాల్లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించారు. అలాగే కేఆర్కే కాలనీలో నూతనంగా నిర్మించిన మైనార్టీ బాలబాలికల పాఠశాలను ప్రారంభించిన అనంతరం లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి మంత్రులను శాలువాలతో సన్మానించారు. అనంతరం తనీషా గార్డెన్‌లో డీసీసీ అధ్యక్షులు నరేష్ జాదవ్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా కాంగ్రెస్ బీఎల్‌ఏ –2 సమావేశంలో మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, "ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్న ఓట్లను తొలగించేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని" ప్రతి కార్యకర్త అప్రమత్తంగా ఉండి ఓటు హక్కును కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఆదిలాబాద్ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్, మాజీ ఎంపీ సోయం బాపురావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మార్కెట్ కమిటీ చైర్మన్లు , ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

- **కేయూ ఓఎస్డీ ఆచార్య వెంకట్రాం రెడ్డి**
- **రెజోనెన్స్ సంస్థ క్యాంపస్ డ్రైవ్‌లో 32 మంది ఎంపిక**



**ఉద్యమ కెరటం, వరంగల్:** విద్యార్థులు నైపుణ్యాలు, బోధనా సామర్థ్యం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలని కాకతీయ విశ్వవిద్యాలయం ఓఎస్డీ ఆచార్య వెంకట్రాం రెడ్డి సూచించారు. కేయూ ప్లేస్మెంట్ సెల్ ఆధ్వర్యంలో డైరెక్టర్ డాక్టర్ చిర్ర రాజు గౌడ్ అధ్యక్షతన గణిత శాస్త్ర విభాగ సెమినార్ హాల్‌లో రాజస్థాన్‌లోని కోటాకు చెందిన రెజోనెన్స్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఆధ్వర్యంలో శనివారం జూనియర్ లెక్చరర్ల నియామక క్యాంపస్ డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ విభాగాలకు చెందిన మొత్తం 60 మంది ఫైనల్ ఇయర్ విద్యార్థులు పాల్గొన్నారు. మొదట నిర్వహించిన రాత పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులకు డెమో తరగతులు నిర్వహించి బోధనా నైపుణ్యాలను పరిశీలించారు. అనంతరం సంస్థ హెచ్‌ఆర్ ప్రతినిధులు తుది ఇంటర్వ్యూలు నిర్వహించి మొత్తం 32 మంది విద్యార్థులను జూనియర్ లెక్చరర్‌లుగా ఎంపిక చేశారు. ఎంపికైన వారికి నెలకు రూ.30వేల జీతం ఇవ్వనున్నట్లు సంస్థ తెలంగాణ ఇన్‌చార్జి మధుసూదన్ రెడ్డి తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య వెంకట్రాం రెడ్డి మాట్లాడుతూ కేయూ ప్లేస్మెంట్ సెల్ పరిశ్రమలు, ప్రముఖ విద్యాసంస్థలతో అనుసంధానం కల్పిస్తూ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు అందించడంలో కీలకపాత్ర పోషిస్తోందని అన్నారు. ఈ డ్రైవ్‌లో భారీ సంఖ్యలో విద్యార్థులు ఎంపిక కావడం విశ్వవిద్యాలయానికి గర్వకారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మ్యాథమెటిక్స్ విభాగాధిపతి డాక్టర్ భార్గవి శర్మ, ఫిజిక్స్ హెచ్‌ఓడి డాక్టర్ పద్మజ, రెజోనెన్స్ సంస్థ హెచ్‌ఆర్ ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే వంగ సుబ్బా రావుకు సండ్ర వెంకట వీరయ్య నివాళి



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ఇల్లందు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం వీఎం బంజారా గ్రామానికి చెందిన వంగ సుబ్బారావు మృతి పట్ల బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. శనివారం ఆయన వంగ సుబ్బారావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ ప్రజా సేవలో వంగ సుబ్బారావు అందించిన సేవలు చిరస్మరణీయమని, ఆయన మరణం రాజకీయ రంగానికి తీరని లోటని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కనగాల వెంకట్రావు, మందాడపు అశోక్, షేక్ గౌస్, తావు నాయక్, వంగ చిన్నపండు, బాబురావు, కొత్తపల్లి సుధాకర్, రవి, చంటి మరకాలతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 28 నుంచి పల్స్ పోలియో కార్యక్రమం

## ఐదేళ్ల లోపు పిల్ల లకు మూడు రోజుల పాటు టీకాలు



**ఉద్యమ కెరటం, జైనూర్:** ఈనెల 28 నుంచి 30 వరకు మూడు రోజుల పాటు పల్స్ పోలియో టీకా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జైనూర్ మండల వైద్యాధికారి డాక్టర్ మేజర్ మురళీ కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా తొలి రోజు 28న మండలంలోని అన్ని పోలియో బూత్‌లలో 5 సంవత్సరాల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. తల్లి దండ్రులు తమ పిల్లలను సమీప పోలియో బూత్‌కు తీసుకువచ్చి తప్పనిసరిగా టీకా వేయించాలని కోరారు. 29, 30 తేదీల్లో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, ఇతర ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని పేర్కొన్నారు. పోలియో రహిత సమాజం కోసం ప్రతిఒక్కరు సహకరించాలని కోరారు.

# కోహినూర్ గ్రామ యువకుడు ఇశ్రు అగ్నివీర్‌గా ఎంపిక

## శిక్షణకు బయల్దే రిన యువకుడికి గ్రామస్తుల సన్మానం



**ఉద్యమ కెరటం, జైనూర్:** సిర్పూర్ మండల పరిధిలోని కోహినూర్ గ్రామానికి చెందిన యువకుడు ఇశ్రు ప్రతిష్టాత్మక అగ్నివీర్ కు ఎంపికయ్యాడు. దేశ సరిహద్దుల్లో సేవలందించేందుకు అగ్నివీర్‌గా ఎంపికైన ఇశ్రు శనివారం శిక్షణకు బయల్దేరాడు. ఈ సందర్భంగా గ్రామ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆయనకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువత, గ్రామ పెద్దలు ఇశ్రుకు శాలువా కప్పి, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామం నుంచి దేశ సేవకు యువకుడు ఎంపిక కావడం గర్వకారణమని, ఇశ్రు మరెంతో మంది గ్రామీణ యువతకు ఆదర్శంగా నిలుస్తాడని కొనియాడారు. దేశ సరిహద్దుల రక్షణలో కోహినూర్ గ్రామం ఎప్పుడూ ముందుంటుందని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువత, స్థానిక ప్రజలు పాల్గొని ఇశ్రుకు ఆత్మీయ వీడ్కోలు పలికారు.

# భక్తిశ్రద్ధలతో సాయి బాబా ఆలయ వార్షికోత్సవం

## అన్నప్రసాద కార్యక్రమంలో ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** సత్తుపల్లి పట్టణంలోని శ్రీ సాయిబాబా ఆలయంలో 16వ వార్షికోత్సవ వేడుకలు శనివారం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని సాయి బాబా ఆశీర్వాదాలు పొందారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అన్నప్రసాద కార్యక్రమంలో భక్తులతో కలిసి పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ రిహానా బేగం, వైస్ చైర్‌పర్సన్ బొంతు సుమలత, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, మున్సిపల్ కౌన్సిలర్లు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నారావు, సీనియర్ నాయకుడు చల్ల గుళ్లనరసింహారావు, ఆలయ కమిటీ సభ్యులు మోరిశెట్టి సాంబశివ రావు, భక్తులు, ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

